# మినీకథ

"రంగా. నువ్వీరోజు అందంగా వున్నావే!"

"ఊఁ"

"ఏమిటీ ఆ'వూఁ,'ఆ లోలాకులు.కాటుక. తలలో పూలు. చలువచేసిన చీర— యివన్నీ చూస్తుంటే ఏ మగాడికి మాత్రం తెగులు పుట్టకుండా వుంటుంది!

మొగుళ్ళ నెలా వశపరచుకోవాలో మీ ఆడంగులకు బాగా తెలుసు."

"..............."

"ఏం. అంతలోనే పొగరటే-కాస్త పొగిడితే చాలు. నీల్గుడు. మాట్లాడవేం?"

"అలా వూరికే చెట్టెక్కిస్తూ ఏం మాట్లాడమంటారు?"

"చెట్టుకాదే నెత్తి కెక్కించుకుంటున్నాను"

"పొద్దు పోయింది.రండి పడుకుందాం."

"అమ్మ నీ తొందర తగలడా! ఏం. నిలవలేకపోతున్నావుటే. ఇప్పుడే కదా భోంచేశాను. కాస్త రెస్టు తీసుకోనీ.పొద్దున్న నగా వెళ్ళినవాణ్ణి. అలసి సొలసి ఒళ్ళు హూనం చేసుకుని వస్తే. నువ్వేమో ఆక్టోపస్‌లా నన్ను పీల్చెయ్యటానికి రెడీ అవుతున్నావా. అవునూ.... నీకు ఆక్టోపస్ అంటే తెలుసుటే?"

"ఏమిటి?"

"ఎనిమిదికాళ్ళ రాక్షసి బల్లి."

"అయ్యబాబోయ్. భయమేస్తుంది. అలాంటివి చెప్పకండిప్పుడు."

"భయమెందుకూ. మీ వంశమే దాని దీనూ. నీకు అక్కో. పిన్నో అవుతుంది".

"అబ్బబ్బ నేను పడుకుంటున్నాను బాబూ."

"అవునే. తెగ బలిసిన ముండవి. నా మానానికి నన్నొదిలి గుర్రుపెడతావా! నేనేమయితే నీకేం. నీకు మాత్రం ఏదీ వేళ తప్పకూడదు. పొద్దంతా నిద్రే. రాత్రంతా నిద్రే. అందుకే ఈ యింట్లో దరిద్రమిట్లా



వుంది. ఈ గలీబు చూడు ఎలా మాసిందో. ఓ సారి వుతకాలని తెలీదూ!"

"మరచిపోయాను...."

"ఇలాంటి వెందుకు జ్ఞాపక ముంటాయి? షోకులు చేసుకోవటం. కమ్మటి వంటలు చేసుకుని గొంతుదాకా దిగమెక్కటం మాత్రం జ్ఞాపకముంటాయి. అమ్మా— ఆయాసం వస్తున్నది. కాళ్ళుపీకుతున్నాయి. గుండెల్లో— యిదిగో. యిక్కడ నొప్పిగా వుంది."

"కాళ్ళు పట్టనా?"

"ఛట్ వెధవా. గుండెలో నొప్పంటే కాళ్ళు పడతావా?"

"మంచినీళ్ళివ్వనా?"

"పాలేం చేశావే. పొద్దున్నే గడగడ తాగటానికి దాచుకున్నావా?"

"ఇప్పుడు పాయసంలో పోశానుగదా. ఉదయం మళ్ళీ బెడ్ కాఫీ అంటారు. అంత పెందరాళే పాలవాడు రాడు."

"ఓసి నీ సోది తగలడా. ఇదెప్పుడూ వుండే ఏడుపేగాని కాసిని పాలు తీసుకురా."

"అలాగే. ఒక్క నిమిషం."

"...................."

"ఒసేవ్"

"ఊఁ"

"నువ్వు కాస్త టెక్కులాడివే గాని. ఇలా కాలికింద వుంచితే బాగానే పనికొస్తావు".

"ఊఁ"

"అప్పటిన్నుంచి తొందరపడితివిగా. రా మరి."

"మీ అలసట తగ్గిందా?"

"నా అలసటతో నీకేం. నీ అవసరం తీర్చటానికే రమ్మంటున్నాను. రా"

"అలా అయితే వద్దులెండి. పడుకోండి."

"ఓసి గర్విష్టిముండా. ఇంత తలబిరుసా. నా చేత బతిమాలించుకుంటావుటే...."

"ఊ. రండి. మీరు సంతోషంగా వుంటే నాకంతే చాలు."

"అవును మరి. నేను సంతోషంగా వుంటేనేగద. నీ గొంతెమ్మ కోరికలన్నీ తీరేది."

"అబ్బ. వూరొక్కండీ."

"మీ ఆడంగులు మొగుడి ప్రేమ తప్ప యింకేమీ వద్దంటారు. ప్రేమంటూ వుంటే అది రుజువు చేసుకొమ్మంటారు. ఎలా రుజువు చేసుకోవాలి? మీరడిగినవన్నీ తెచ్చివ్వాలి.ఎలాగైనా తెలివిమీరిపోయారు."

"...................."

"ఏమే. మాట్లాడవేం. మళ్ళీ ఏమొచ్చింది?"

"ఊఁ."

# గాథావళి

## కవి కోయిల



దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఒకసారి కాకినాడ వచ్చినపుడు ఆయనను చూడడానికి నేనూ. నా మెడికో మిత్రుడు వెళ్ళాం. తిరిగి వచ్చేస్తుంటే దారిలో నా మిత్రుడు అడిగాడు "కృష్ణశాస్త్రి గొంతు ఎందుకు మూగబోయిం"దని. నేను ఆయన Larynx (స్వరపేటిక) దెబ్బతిన్నదని చెప్పడానికి బదులు 'Syrynx' దెబ్బతిన్నదన్నాను. (Syrynx పక్షుల స్వరపేటిక). నా మిత్రుడు మౌనంగా వూ కొట్టాడు. ఆ తరువాత నా పొరపాటును నేనే గమనించి నా మిత్రుణ్ణి అడిగాను. "నేను తప్పు చెప్పినా నువ్వు సరిదిద్దకుండా వూరుకొన్నావేం" అని.

నా మిత్రుడు నవ్వి అన్నాడు:

"కృష్ణశాస్త్రి కోయిలపాటలు వ్రాస్తారు కదా! అందువలన ఆయన గొంతులో 'Syrynx' వుండేమోననుకున్నాను."

—వలవల శ్రీనివాసరావు